సాక్షి
ప్రకాశం

ఆదివారం । 10 । నవంబర్ । 2024



అడ్డగోలు తొలగింపులు అడ్డుకుంటాం

మార్కాపురం నియోజకవర్గంలో ఆక్రమణల పేరుతో అడ్డగోలుగా భవనాలు తొలగించడాన్ని అడ్డుకుంటామని మాజీ ఎమ్మెల్యే అన్నా అన్నారు. - 8లో..



భక్తి శ్రద్ధలతో కోటి సోమవారం

కార్తీక మాసంలో పవిత్రమైన కోటి సోమవారం పర్వదినం సందర్భంగా శనివారం జిల్లా వ్యాప్తంగా ఆలయాలకు భక్తులు పోటెత్తారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. - 8లో..

గరిష్టం/కనిష్టం
34/25

వాతావరణం

ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఉంటుంది. ఒకటి రెండు చోట్ల చిరుజల్లులు పడవచ్చు. రాత్రి చలిగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

నేటి నుంచి రాష్ట్ర స్థాయి బ్యాడ్మింటన్ పోటీలు

ఒంగోలు: రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ పోటీలు ఈనెల 10 నుంచి 13వ తేదీ వరకు స్థానిక లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీలో నిర్వహిస్తున్నట్లు లార్డ్ కృష్ణా బ్యాడ్మింటన్ అకాడమీ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి మురళీకృష్ణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ 11 విభాగంలో నిర్వహిస్తున్న ఈ పోటీల్లో పాల్గొనదలచిన క్రీడాకారులు తమ వివరాలను ఎం.రఘుబాబు, ఎ.శశిధర్ లకు మొబైల్ నంబర్లు 9905756789, 9398260109లను సంప్రదించాలన్నారు. పోటీలు ఆదివారం ఉదయం 8 గంటలకు ప్రారంభమవుతాయన్నారు.

ఈతముక్కల పీహెచ్‌సీ ఆకస్మిక తనిఖీ

- తనిఖీ చేసిన కలెక్టర్ తమీమ్ అన్సారియా

కొత్తపట్నం: ఈతముక్కల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శనివారం కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆకస్మిక తనిఖీ చేశారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న గర్భిణులతో కలెక్టర్ ప్రత్యేకంగా మాట్లాడారు. ప్రతి నెలా కాన్పుల కోసం ఎంత మంది ఆస్పత్రికి వస్తున్నారు, గర్భిణి అని నిర్ధారణ అయినప్పటి నుంచి వారికి అందిస్తున్న మందులు, వారి ఆరోగ్య పర్యవేక్షణ తదితర వివరాలను వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ల్యాబ్, కాన్పుల గది, ఆఫీసును పరిశీలించి సంబంధిత రికార్డులను తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్‌లో సంతకం చేసిన సిబ్బంది అందరూ వాస్తవంగా విధుల్లో ఉంటున్నారా లేరా కలెక్టర్ పరిశీలించారు. ఆయా ఉద్యోగుల విధులను, వారు నిర్వహిస్తున్న రిజిస్టర్లను ఆమె తనిఖీ చేశారు. రోగులకు సంబంధించిన రికార్డుల నిర్వహణ సక్రమంగా ఉండాలని కోరారు. జిల్లాలోని అన్ని ఆస్పత్రుల రిజిస్టర్ల నిర్వహణలో ఏకరూపత (యూనిఫామ్) ఉండేలా చూడాలని డీఎంహెచ్‌వో సురేష్ కుమార్‌ను ఆదేశించారు.

ప్రశ్నించే గళాలకు.. ఉక్కు సంకెళ్లు

టీడీపీ రెడ్ బుక్ రాజ్యాంగంలో పోలీసులు భాగస్వామ్యం అవుతున్నారు. ప్రభుత్వ అసమర్థత, వైఫల్యాలను ప్రశ్నించే సోషల్ మీడియా గళాలకు ఉక్కు సంకెళ్లు బిగిస్తున్నారు. ఎక్కడికక్కడ టీడీపీ నేతలతో ఫిర్యాదులు చేయించడం.. ఎక్కడెక్కడో వారిని ఇక్కడకు తీసుకువచ్చి కేసుల పేరుతో హింసిస్తున్నారు. వీరు చేసిన తప్పల్లా ప్రభుత్వ వైఫల్యాలను సోషల్ మీడియా వేదికగా ప్రశ్నించడమే. కూటమి నేతలు ఇస్తున్న లిస్టులను చేతిలో పెట్టుకుని జిల్లాలు దాటి మరీ వెళ్లి అక్రమ అరెస్టులకు పూనుకుంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా మహిళలను సైతం అర్ధరాత్రులు పోలీస్ స్టేషన్ల చుట్టూ తిప్పారు. మరో అడుగు ముందుకేసి ప్రభుత్వ విధాలను ప్రశ్నించిన ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయడం పరాకాష్టగా నిలిచింది.



- ఎమ్మెల్యేపైనా కేసుల నమోదు
- వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా కార్యకర్తల అరెస్ట్‌లు
- ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ప్రశ్నిస్తే కేసులతో బెదిరింపులు
- అయ్యప్ప మాలధారులు గుడికి వెళ్లకుండా పోలీసు స్టేషన్‌కు తరలించి వేధింపులు
- మహిళని కూడా చూడకుండా అర్ధరాత్రుళ్లు పోలీస్‌స్టేషన్లు తిప్పిన వైనం
- పరాకాష్టకు చేరిన పోలీసుల అత్యుత్సాహం

సాక్షి ప్రతినిధి, ఒంగోలు:

జిల్లాలో ఖాకీలకు అధికార పార్టీ నేతలు చెప్పిందే వేదంగా మారింది.ప్రభుత్వ విధానాలను సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్న సామాన్య ప్రజలు, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెడుతున్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్‌పై వ్యతిరేక పోస్టులు పెడుతున్నారన్న సాకులు చూపిస్తూ సంకెళ్లు వేస్తున్నారు. చట్టాన్ని అటకెక్కించిన పోలీసులు కూటమి నేతలు ఇచ్చిన లిస్టు చేతపట్టుకొని కేసులు నమోదు చేస్తున్నారు. విచారణ పేరుతో వారిని పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పుతూ వారి కుటుంబ సభ్యులను ఆందోళనకు గురిచేస్తున్నారు. మహిళలను అర్ధరాత్రి పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లకూడదని చట్టాలు చెబుతున్నప్పటికీ పోలీసు స్టేషన్ చుట్టూ తిప్పుతూ వేధిస్తున్నారు. సోషల్ మీడియాలో అసభ్యకరమైన పోస్టులు పెట్టినందుకే కేసులు పెడుతున్నట్లు చెబుతున్న పోలీసులు మాజీ సీఎం, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన కుటుంబ సభ్యులపై, మాజీ మంత్రులు, నాయకులపై టీడీపీ, జనసేన సోషల్ మీడియా కార్యకర్తలు పెడుతున్న అవాంఛనీయ కామెంట్ల విషయంలో మాత్రం చూసీ చూడనట్లు వ్యవహరిస్తుండడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

తెలంగాణా నుంచి తీసుకొచ్చి...

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కుమార్తెలపై పోస్టు పెట్టడమే ఆమె చేసిన నేరమైంది. ఉద్దేశపూర్వకంగా రాష్ట్రంలో అనేక జిల్లాల్లో ఆమెపై కేసులు పెట్టించారు. అలాగే తెలంగాణలో ఉన్న ఆమెపై ఒంగోలు వన్‌టౌన్ పోలీసు స్టేషన్లో కేసు పెట్టించారు. చిలకలూరిపేట పోలీసు స్టేషన్లో ఉన్న ఆమెను ఒంగోలు పోలీసులు స్వయంగా వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. బుధవారం అదుపులోకి తీసుకొని ఒంగోలు తీసుకొచ్చిన ఆమెను విచారణ పేరుతో అర్ధరాత్రి డీఎస్పీ ఆఫీసుకు తీసుకెళ్లారు. అక్కడ నుంచి ఎస్పీ కార్యాలయానికి తీసుకెళ్లినట్లు సమాచారం. సుధారాణిని ఆమె కుటంబ సభ్యులతో కలిసే అవకాశం ఇవ్వలేదు. కనీసం ఒక మహిళ అనే గౌరవం లేకుండా పోలీసులు దురుసుగా ప్రవర్తించినట్లు సుధారాణి న్యాయమూర్తి ఎదుట చెప్పారు. ఒంగోలు పోలీసులు తనను వేధించారని న్యాయమూర్తికి ఫిర్యాదు చేశారు. పోలీసు తీరుపై జిల్లా వ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ప్రభుత్వాలు వస్తూ ఉంటాయి పోతుంటాయి, కానీ శాంతి భద్రతల పరిరక్షణ విషయంలో చట్టం ప్రకారం నడుచుకోవాల్సి పోలీసులు అధికార పార్టీ సామాన్య కార్యకర్తల్లా ప్రవర్తించడం సబబుగా లేదని చెబుతున్నారు. నిజానికి సుధారాణిని 15 రోజుల పాటు పోలీసు స్టేషన్ల చుట్టూ తిప్పాలని పోలీసులు ప్లాన్ చేసినట్లు సమాచారం. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ లీగల్ సెల్ హైకోర్టులో హేబియస్ కార్పస్ పిటిషన్ వేయడంతో అప్పటికప్పుడు ఒంగోలు పోలీసులు హడావుడి చేశారు. అప్పటి వరకు ఆమె మీద ఒంగోలులో ఎలాంటి ఫిర్యాదు లేదని సమాచారం. జనసేన జిల్లా కార్యదర్శి ముత్యాల కళ్యాణ్‌ను పిలిపించి కేసు పెట్టించి అరెస్టు చూపించినట్లు తెలిసింది. ఆ తరువాత 41 ఏ నోటీసు ఇచ్చి పంపించారు. సుధారాణి వ్యవహారం జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

అయ్యప్ప గుడికి వెళుతుండగా ...

పల్నాడు జిల్లా సత్తెనపల్లి నియోజకవర్గంలోని ముప్పాళ్ల మండలం దమ్మాలపాడు గ్రామానికి చెందిన కల్లా నాగిరెడ్డి సోషల్ మీడియాలో క్రియాశీలకంగా ఉంటారు. విజయవాడ వరదల సందర్భంగా ప్రజా సంపద లాటీ అంటూ సోషల్ మీడియాలో ఒక మెసేజ్ పెట్టారు. ఈ విషయంలో లోకం కోడై కూయడం తెలిసిందే. అయినా కూటమి పాలకులు సహించలేక పోయారు. ఆయన మీద ఈ నెల 21వ తేదీన కుంచాల యశ్వంత్ చేత ఒక ఫిర్యాదు చేయించారు. అదో పెద్ద నేరంగా పరిగణించేశారు. పోలీసులను ఉసిగొల్పి అరెస్టు చేయించి వేధింపులకు దిగారు. ప్రస్తుతం నాగిరెడ్డి అయ్యప్ప మాల ధరించి ఉన్నారు. తాడేపల్లిలోని అయ్యప్ప దేవాలయానికి వెళుతున్న ఆయనను మార్కాపురం పోలీసులు అరెస్టు చేసి తీసుకొచ్చారు. ఆయన కుటుంబ సభ్యులకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదు. దాంతో వారంతా ఆందోళనకు గురయ్యారు. నాగిరెడ్డి ఆచూకీ కోసం రెండు రోజుల పాటు తల్లడిల్లారు. ప్రభుత్వం ఏ తప్పూ చేయక పోతే నాగిరెడ్డి ప్రశ్నకు సమాధానం చెప్పేదని, ఆయనను అరెస్టు చేసి కసి తీర్చుకుంటుందని విమర్శలు వినిపిస్తున్నాయి.

విశాఖ పట్టణం నుంచి పొదిలికి ..

ఎక్కడో విశాఖ పట్టణానికి చెందిన వ్యక్తి ఒక పోస్టు పెడితే ఇక్కడ పొదిలిలో కేసు పెట్టడం విచిత్రం. అదే కూటమి ప్రభుత్వ పాలనకు నిదర్శనంగా చెప్పుకోవాలి. విశాఖ పట్టణానికి చెందిన వైఎస్సార్‌సీపీ సోషల్ మీడియా ప్రతినిధి రమణారెడ్డి పెట్టిన ఒక పోస్టు వలన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ గౌరవం దెబ్బ తిన్నదని కేసు పెట్టారు. ప్రభుత్వ పెద్దల నుంచి వచ్చిన ఆదేశాలతో పొదిలికి చెందిన నారబోయిన నంద కిషోర్‌తో ఫిర్యాదు చేయించినట్టు తెలుస్తోంది. విశాఖలో ఆయనను అరెస్టు చేసి ఒంగోలు ఎస్పీ కార్యాలయానికి తీసుకొచ్చారు. అక్కడ నుంచి పొదిలికి తరలించారు. వేధింపులకు గురిచేశాక 41ఏ నోటీసు ఇచ్చి పంపించారు.

పేకాట క్లబ్‌లపై నిలదీసినందుకు.. ఎమ్మెల్యే తాటిపర్తిపై కేసు

యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ మీడియాలో క్రియాశీలకంగా ఉంటారు. బాధ్యత కలిగిన ఒక ప్రతిపక్ష పార్టీ ఎమ్మెల్యేగా ప్రభుత్వ వ్యతిరేక విధానాలను సోషల్ మీడియా వేదికగా ఎప్పటికప్పుడు ప్రశ్నిస్తుంటారు. ఆయనకు సమాధానం ఇవ్వలేక సతమతమవుతున్న రాష్ట్ర ప్రభుత్వం కేసులతో దొంగదెబ్బ కొట్టేందుకు ప్రయత్నించింది. తాటిపర్తిపై పోలీసు కేసులు నమోదు చేయించి తన నిజ స్వరూపాన్ని బయటపెట్టుకుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత రాష్ట్రంలో నిర్వహిస్తున్న పేకాట క్లబ్బుల గురించి అధికార తెలుగుదేశం పార్టీ అనుకూల పత్రికలు ఈనాడు, ఆంధ్రజ్యోతిలతో పాటుగా ఏబీఎన్ చానెల్‌లో కథనాలు వచ్చాయి. ఈ కథనాలను ప్రస్తావిస్తూ రాష్ట్ర ప్రభుత్వాన్ని, మంత్రి నారా లోకేష్‌ను ఎమ్మెల్యే తాటిపర్తి నిలదీశారు. దీనిపై రెండు రోజుల క్రితం పాత తేదీలను వేసి కేసు నమోదు చేశారు. యర్రగొండపాలెం ఎస్ఐ చౌడయ్య వాట్సప్ ద్వారా ఎఫ్ఐఆర్ కాపీలను ఎమ్మెల్యేకు పంపించారు. అంతేకాకుండా ఎన్నికల సమయంలో పుల్లలచెరువు, త్రిపురాంతకం, పెద్దారవీడు, పెద్ద దోర్నాల మండలాల్లో నమోదైన కేసులకు సంబంధించి 41 ఏ నోటీసులు జారీ చేశారు. ఒక ఎమ్మెల్యేపై కేసు నమోదు చేయడం పలు విమర్శలకు తావిస్తోంది. పోలీసుల వైఖరి ఎంతమాత్రం సరైంది కాదని ప్రజలు చర్చించుకుంటున్నారు. ప్రభుత్వ విధానాలను ప్రశ్నించకుండా ఉండాలనుకోవడం సమర్ధనీయం కాదని చెబుతున్నారు. ఈ విషయంలో ఎమ్మెల్యే తాటిపర్తి.. డీజీపీ ద్వారకా తిరుమల రావును కలిసి పోలీసుల వైఖరిపై ఫిర్యాదు చేశారు.

జీజీహెచ్ వద్ద టెన్షన్ టెన్షన్

- లైంగికదాడికి గురైన బాలిక కుటుంబాన్ని పరామర్శించేందుకు వచ్చిన వైఎస్సార్ సీపీ, దళిత సంఘాల నాయకులు
- అడ్డుకున్న పోలీసులు
- వైఎస్సార్ సీపీ నేతలతో వాగ్వాదం
- సఖి కేంద్రం వద్ద బైఠాయించి నిరసన తెలిపిన నేతలు



వైఎస్సార్ సీపీ నాయకులను అడ్డుకుంటున్న డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు



సఖీ కేంద్రం వద్ద బైఠాయించి నిరసన తెలుపుతున్న మాజీ మంత్రి సురేష్, డాక్టర్ వెంకయ్య

ఒంగోలు టౌన్: ఒంగోలు ప్రభుత్వ సర్వజన ఆస్పత్రి ఆవరణలోని సఖీ భవనం వద్ద శనివారం టెన్షన్ వాతావరణం నెలకొంది. ఉదయం నుంచే పోలీసులు పెద్ద ఎత్తున మోహరించారు. టంగుటూరు మండలానికి చెందిన నాలుగో తరగతి చదువుకుంటున్న దళిత బాలికపై అదే పాఠశాలకు చెందిన ఒక ఉపాధ్యాయుడు లైంగికదాడికి పాల్పడిన ఘటనకు సంబంధించి బాధిత కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పేందుకు వైఎస్సార్ సీపీ ప్రతినిధుల బృందం రావడంతో పోలీసులు భారీగా చేరుకున్నారు. ఒంగోలు డీఎస్పీ రాయపాటి శ్రీనివాసరావు, తాలుకా సీఐ కె.అజయ్ కుమార్, వన్‌టౌన్ సీఐ నాగరాజు, సింగరాయకొండ సీఐ హజరత్తయ్యతో పాటుగా పలువురు ఎస్ఐలు అక్కడ మోహరించారు. ఉదయం నుంచే సఖీ భవనం వైపునకు ఎవరినీ రానీయకుండా అడ్డుకున్నారు. సరిగ్గా మధ్యాహ్నం గం.12.20 తర్వాత మాజీ మంత్రి డా.ఆదిమూలపు సురేష్, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు, పీడీసీసీబీ మాజీ చైర్మన్ డా.మాదాసి వెంకయ్య, దళిత నాయకులు నీలం నాగేంద్రరావు, బిల్లా చెన్నయ్య తదితర దళిత సంఘాలకు చెందిన నాయకులు అక్కడకు వచ్చారు. సఖీ భవనంలో చికిత్స పొందుతున్న బాధిత బాలిక తల్లిదండ్రులను కలిసి పరామర్శించేందుకు ప్రయత్నించగా డీఎస్పీతో సహా పోలీసులు అడ్డుకున్నారు. బాధిత బాలిక తనకు సమీప బంధువని, తనని పరామర్శించడం తన నైతిక బాధ్యతని వేమూరు వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి వరికూటి అశోక్ బాబు చెప్పినా వినిపించుకోలేదు. దాంతో పోలీసులతో వాగ్వాదానికి దిగారు. డా.మాదాసి వెంకయ్య పోలీసుల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఘటన జరిగి నాలుగు రోజులవుతున్నా కేసు ఎందుకు నమోదు చేయలేదని ప్రశ్నించారు. దాంతో సదరు ఉపాధ్యాయుడి పేరు బాలిక చెప్పలేక పోతోందని, విచారణ జరుపుతున్నామని చెప్పడంతో నాయకులు మండిపడ్డారు. ఈలోపు బాలిక తండ్రి సఖీ భవనం లోంచి బయటకు వచ్చేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. వారితో ఆయన వాగ్వాదానికి దిగారు. అయినా పట్టించుకోకుండా ఆయనను ఒక పోలీసు సఖీ భవనం లోపలకు నెట్టడం కనిపించింది. వైఎస్సార్ సీపీ నాయకులను కూడా పోలీసులు లోపలకు వెళ్లకుండా నెట్టివేయడంతో విధిలేని పరిస్థితిలో అక్కడే బైఠాయించారు. దీంతో జీజీహెచ్ పరిసరాల్లో కాసేపు ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. ఆ తరువాత నాయకులను లోపలకు అనుమతించారు. ఆదిమూలపు సురేష్, వరికూటి అశోక్ బాబు, మాదాసి వెంకయ్య లోపలకు వెళ్లి బాలిక తల్లిదండ్రులను పరామర్శించారు. పాఠశాలలో జరిగిన విషయాన్ని బాలిక తల్లిదండ్రులు వివరించి చెప్పారు. తన కూతురితో పాటుగా మరో బాలికను లోపలకు పిలిపించుకున్నాడని, ఆ తరువాత ఆ బాలికను బయటకు పంపించి తన కూతురి పట్ల అసభ్యంగా ప్రవర్తించాడని, లైంగికదాడికి పాల్పడ్డాడని తెలిపారు. ఈ ఘటనలో చిన్నారికి న్యాయం చేయాలని వైఎస్సార్ సీపీ నాయకులు డిమాండ్ చేసిన తరువాత బాలిక స్టేట్‌మెంట్‌ను పోలీసులు రికార్డు చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడిన నాయకులు బాలిక పట్ల జరిగిన అఘాయిత్యం కేసు నమోదు చేయించడానికే మూడు రోజుల పాటు పోరాడాల్సి వచ్చిందని, ఇక న్యాయం కోసం ఎంత పోరాటం చేయాల్సి వస్తుందోనన్న సందేహాలు వ్యక్తం చేశారు. పోలీసుల తీరు బాగాలేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. బాధిత బాలిక కుటుంబానికి న్యాయం చేసేంత వరకు అన్నీ విధాలుగా అండగా నిలబడతామని నాయకులు చెప్పారు.

నీచంగా పోస్టులు పెడుతున్న టీడీపీ సోషల్ మీడియా

- మాజీ సీఎం జగన్, ఆయన కుటుంబ సభ్యులపై పోస్టులు
- వారిని అరెస్టు చేయాలంటూ ఎస్పీకి వినతి



తాలూకా సీఐ అజయ్‌కుమార్ కు వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు సిటీ: టీడీపీ అనుబంధ సోషల్ మీడియా ప్రతినిధులు మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిపై, ఆయన కుటుంబ సభ్యులపై నీచంగా పోస్టులు పెడుతున్నారని, వారిని వెంటనే అరెస్టు చేయాలని మాజీ మంత్రి, పార్టీ పీఏసీ సభ్యుడు ఆదిమూలపు సురేష్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ డిమాండ్ చేశారు. టీడీపీ సోషల్ మీడియా నీచ సంస్కృతి, అసత్య ప్రచారాలపై అన్ని జిల్లాల ఎస్పీలకు వినతి పత్రం ఇవ్వాలని పార్టీ పిలుపు ఇచ్చిందన్నారు. శనివారం ఉదయం వారు ఎస్పీ దామోదర్‌ను కలసి వినతిపత్రం ఇచ్చేందుకు ఎస్పీ కార్యాలయానికి వచ్చారు. ఎస్పీ లేకపోవడంతో సిబ్బంది వారిని అడ్డుకున్నారు. ఒంగోలు డీఎస్పీకి ఇవ్వాలని సిబ్బంది సూచించారు. ఎస్పీ లేకపోయినా ఎవరు ఉంటే వారికి ఇచ్చి వెళతామని చెప్పడంతో అక్కడ ఉన్న తాలూకా సీఐకి వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మీడియాతో మాట్లాడారు. జెడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ మాట్లాడుతూ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన భార్య భారతి, వారి కుటుంబ సభ్యులపై టీడీపీ సోషల్ మీడియా నీచమైన భాష ప్రయోగించి పోస్టులు పెడుతోందని, వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఈ రోజు రాష్ట్ర వ్యాప్తంగా టీడీపీ సోషల్ మీడియా చేస్తున్న దుష్ప్రచారాన్ని, నీచమైన సంస్కృతిని ఎండగడుతూ వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ ఆధ్వర్యంలో అన్ని జిల్లాల్లో ఎస్పీలకు వినతిపత్రాలు ఇవ్వాలని నిర్ణయించిందన్నారు. ఎస్పీని కలవడానికి వచ్చామని, ఎస్పీ అందుబాటులో లేని కారణంగా అదనపు ఎస్పీ కలవడానికి ప్రయత్నిస్తే వారు కూడా అందుబాటులోకి రాలేదన్నారు. ఒక వైపు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ప్రభుత్వ పరిపాలన మీద కామెంట్లు పెడుతుంటే అక్రమ అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతున్నారని ధ్వజమెత్తారు. టీడీపీ అనుబంధంగా ఉన్న సోషల్ మీడియా కార్యకర్తలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మీద, వారి కుటుంబం మీద లేనిపోనివి సభ్య సమాజం తలదించుకునేలా నీచమైన భాషలో పోస్టులు పెడుతున్నారని, వారి మీద చర్యలు తీసుకోవాలని వినతిపత్రం ఇచ్చామన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చక రోజుకో విధంగా డైవర్షన్ పాలిటిక్స్‌తో ప్రజల దృష్టిని మరల్చే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని సోషల్ మీడియా వేదికగా ప్రశ్నిస్తే రాష్ట్ర వ్యాప్తంగా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలను ఇబ్బంది పెట్టాలన్న దురుద్దేశంతో భయభ్రాంతులకు గురిచేసి అక్రమ అరెస్టులు చేస్తున్నారన్నారు. భవిష్యత్తులో ఏ ఒక్క సోషల్‌మీడియా కార్యకర్త కూడా ప్రభుత్వ విధానాల మీద ప్రశ్నించకుండా ఉండటం కోసం ఇటువంటి నిర్ణయాలు తీసుకుంటోందని ధ్వజమెత్తారు. మా పార్టీ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రెడ్డి మీద, వారి కుటుంబ సభ్యుల మీద అసభ్యకరంగా పోస్టులు పెడుతున్న టీడీపీ అనుకూల సోషల్ మీడియా కార్యకర్తల మీద చర్యలు తీసుకొని అరెస్ట్ చేయాలని డిమాండ్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో పీడీసీసీ బ్యాంక్ మాజీ చైర్మన్ మాదాసు వెంకయ్య, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అక్రమ కేసులు బనాయించి సమర్థించుకుంటున్న ప్రభుత్వం

- తప్పును తప్పని చెప్పున్నందుకే వేధింపులు
- అన్యాయాన్ని ప్రశ్నించే హక్కు ఎమ్మెల్యేలకు లేదా?
- రాష్ట్ర ప్రజల కోసం గళం వినిపిస్తూనే ఉంటాం
- ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

యర్రగొండపాలెం: రాష్ట్రంలో అరాచక కూటమి ప్రభుత్వం అక్రమంగా కేసులు బనాయించి సమర్థించుకోవటానికి ప్రయత్నిస్తోందని, తప్పును తప్పని చెప్పినందుకే వేధింపులకు గురిచేస్తోందని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ విమర్శించారు. స్థానిక వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాస్తవాలను వెలుగులోకి తీసుకొస్తున్న సోషల్ మీడియా కార్యకర్తలు, వైఎస్సార్ సీపీ శ్రేణులు, నాయకులు, సానుభూతిపరులపై కూటమి ప్రభుత్వం అక్రమ కేసులు పెట్టి వేధింపులకు పాల్పడుతోందని ధ్వజమెత్తారు. అనేక హామీలు ఇచ్చి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఎక్కడా ఆ పథకాల ఊసే ఎత్తలేదని విమర్శించారు. వాటిపై ఆధారపడిన పేదలు గళమెత్తితే ఆ గళాన్ని నొక్కేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందన్నారు. ఒక వ్యక్తి ఒక పార్టీకి చెందిన వ్యక్తిగా ఏ విధంగా మీరు ఆధారాలు చూపించి అరెస్ట్ చేస్తున్నారని ప్రశ్నించారు. వారి గ్రామాల్లో జరిగే తప్పును ఆ గ్రామస్తుడు మాట్లాడుకోవడమే నేరమైతే భావప్రకటన స్వేచ్ఛకే విఘాతం కలిగించినట్లేనని అన్నారు. విచ్చలవిడిగా కేసులు బనాయిస్తున్నారని, అన్యాయాల గురించి ప్రతి ఒక్క అధికారికి నివేదికలు సమర్పించామన్నారు. ప్రభుత్వం చేస్తున్న తప్పుల్ని ప్రజల్లోకి తీసుకెళ్లగలుగుతున్నారన్న దుర్బుద్ధితో కావాలని కేసులు పెడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నియోజకవర్గంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయని, ఇంకా చేయాల్సి ఉందని, అభివృద్ధి జరగలేదని అనేవారికి తాను ఛాలెంజ్ విసురుతున్నానని అన్నారు. దళారుల దోపిడీని అరికట్టేందుకు బాధ్యతాయుతంగా అనేక సందర్భాల్లో కలెక్టర్‌ను కలిసి అర్జీలు ఇచ్చానని, శాంతిభద్రతలకు సంబంధించిన అంశాలపై ఎస్పీని కలిసి జరుగుతున్న తప్పిదాలను వారి దృష్టికి తీసుకెళ్లానని తెలిపారు. వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలపై అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆధారాలు చూపించినట్లు చెప్పారు. బెల్టు షాపులు, అక్రమ బియ్యం రవాణా, అక్రమంగా మట్టి తోలకం, ఇసుకను అమ్ముకోవడం లాంటి చర్యల వలన కొంతమందికి మాత్రమే లాభమని, చాలా మందికి నష్టమని అన్నారు. జాతీయ రహదారి నిర్మిస్తుంటే తట్టెడు గ్రావెల్ కూడా బయటి నుంచి కొనకుండా, స్థానికంగా ఉన్న కొండలు, గుట్టల్ని పిండి చేసి నాణ్యత లోపించిన మట్టితో పనులు చేస్తున్నారన్నారు. టీడీపీ నాయకుడి అండదండలతోనే ఈ నాసిరకం రోడ్డు నిర్మిస్తున్నారని ఆరోపించారు.

అమాయక దళితుడిని పాత్రధారుడిగా చేసి...

ఒక అమాయక దళితుడిని పాత్రధారుడిగా చేసి టీడీపీ నాయకుడు తనపై కేసు పెట్టించాడని ఆయన ఆరోపించారు. ఎన్నికల్లో ఓటమి పాలై నియోజకవర్గంలో అధికారం చెలాయిస్తున్న కూటమి నాయకుడు చేస్తున్న అక్రమాలపై, వారి అక్రమ లావాదేవీలపై ప్రశ్నిస్తున్నందుకు తనను అడ్డు తొలగించుకోవటానికి కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నాడని మండిపడ్డారు. తనపై కేసుపెట్టిన దళిత యువకుడు ఎన్నికల సమయంలో తనవద్దకు వచ్చి నా గెలుపు కోసం పాటుపడతానని చెప్పాడని, అటువంటి అమాయకుడిని అడ్డు పెట్టుకొని, వారికి ఆశ చూపించి అతనితో తప్పుడు కేసులు పెట్టేలా పురికొల్పాడని అన్నారు. సమావేశంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఉడుముల శ్రీనివాసరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు ఒంగోలు మూర్తిరెడ్డి, మండల అధ్యక్షుడు కె.ఓబులరెడ్డి, వివిధ విభాగాల నాయకులు బాలగురవయ్య, జబీవుల్లా, షాబీర్ బాష, సత్యనారాయణరెడ్డి, రాములు నాయక్, వెంకటేశ్వరరెడ్డి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు గుర్తింపు

- రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా జిల్లాకు చెందిన నలుగురు ఎంపిక

సాక్షి నెట్‌వర్క్: విద్యారంగంలో ఉత్తమ సేవలందించిన ఉపాధ్యాయులను రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేసింది. ఆ జాబితాలో జిల్లాకు చెందిన నలుగురికి చోటు దక్కింది. గిద్దలూరు మండలం పాదలకుంటపల్లె జెడ్పీ హైస్కూల్ హిందీ ఉపాధ్యాయుడు మొర్రి పిచ్చయ్య యాదవ్, సింగరాయకొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న అర్రిబోయిన రాంబాబు, మద్దిపాడు మండలం బసవన్నపాలెం జెడ్పీ హైస్కూల్ హిందీ పండిట్ మజ్ను బీబీ, జరుగుమల్లి కేజీబీవీ పీఈటీ బీ హెప్సిబా రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు.

నిబద్ధతకు గౌరవం



సింగరాయకొండ: విద్యార్థులకు చదువు నేర్పటమే కాదు వారికి దాతల సహకారంతో ఆర్థిక సహకారం అందించి ఉత్తమ విద్యార్థులుగా తీర్చిదిద్దుతున్న సింగరాయకొండ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎస్‌జీటీగా పనిచేస్తున్న అర్రిబోయిన రాంబాబు రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఎంపికయ్యారు. సుబ్బరాయసత్రంకు బదిలీ అయినప్పుడు పాఠశాలలో ఐదుగురు విద్యార్థులు ఉండగా ఆ సంఖ్యను 38కి పెంచి రెండో పోస్టు రావటానికి కారకులయ్యారు.

విద్యతో పాటు సేవాభావం



గిద్దలూరు రూరల్: మండలంలోని పాదలకుంటపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హిందీ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న మొర్రి పిచ్చయ్యయాదవ్‌ను రాష్ట్ర ప్రభుత్వం ఉత్తమ ఉపాధ్యాయుడిగా ఎంపిక చేసింది. రాచర్ల మండలం యడవల్లి గ్రామానికి చెందిన పిచ్చయ్యయాదవ్ యశ్వంత్ ఎడ్యుకేషనల్ సొసైటీ ద్వారా 15 సంవత్సరాల నుంచి తన జీతంలోని 20 శాతం డబ్బును విద్యార్థులకు, పాఠశాల మౌలిక వసతులకు ఖర్చు చేస్తున్నారు. విద్యార్థులకు పోటీ పరీక్షలను నిర్వహించి బహుమతులు తన సొంతంగా అందజేస్తున్నారు.

ఆటల్లోనూ..సేవలోనూ మేటి



జరుగుమల్లి (సింగరాయకొండ): పవర్ లిఫ్టింగ్, వెయిట్ లిఫ్టింగ్‌లో సుమారు 350 మంది విద్యార్థినులను జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు కృషి చేయడంతో పాటు కరోనా సమయంలో సేవా కార్యక్రమాలు చేసి తనదైన ముద్ర వేసుకున్న జరుగుమల్లి కేజీబీవీ పీఈటీ బీ హెప్సిబా నేడు రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయురాలిగా ఎంపికయ్యారు. పవర్, వెయిట్ లిఫ్టింగ్‌లో 65 మంది విద్యార్థినులు జాతీయ స్థాయికి, సుమారు 285 మంది రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడేందుకు కృషి చేశారు. 2018వ సంవత్సరంలో సావిత్రి బాయ్ పూలే రాష్ట్ర అవార్డుకు ఎంపికయ్యారు.

విద్యార్థుల భవిష్యత్ దిక్సూచిలా..



చీమకుర్తి: ఉపాధ్యాయ వృత్తిలో 22 సంవత్సరాలుగా హిందీ సబ్జెక్ట్ లో ఉత్తమ విద్యార్థులను తయారు చేశారు మద్దిపాడు మండలం బసవన్నపాలెం జెడ్పీ హైస్కూల్ స్కూల్ అసిస్టెంట్ డాక్టర్ షేక్ మజ్ను బీబీ. పాఠశాల స్థాయి నుంచే పిల్లలకు కెరీర్ ఎడ్యుకేషన్‌ను బోధిస్తూ, మెల్బోర్న్ యూనివర్సిటీ వారి కెరీర్ ఎడ్యుకేషన్ ప్రోగ్రాంలో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. రెడ్ క్రాస్ సంస్థలో జూనియర్ రెడ్ క్రాస్ అంటూ పిల్లలను భాగస్వాములు చేశారు.

క్లుప్తంగా

వ్యభిచార గృహంపై పోలీసుల దాడి

గిద్దలూరు రూరల్: వ్యభిచారం నిర్వహిస్తున్న గృహంపై సీఐ కె.సురేష్ శనివారం ఆకస్మికంగా దాడులు నిర్వహించి నిర్వాహకులను అరెస్ట్ చేశారు. ఈ సంఘటన పట్టణంలోని కొప్పువారి వీధిలో జరిగింది. బి.నాగరాజు, సాలమ్మ.. ఎవరికీ అనుమానం రాకుండా ఓ గృహాన్ని అద్దెకు తీసుకుని వ్యభిచారం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు సోదాలు నిర్వహించి వారితో పాటు ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

అర్హులందరికీ ఉచిత న్యాయ సహాయం

- సీనియర్ సివిల్ జడ్జి శ్యాంబాబు


ప్రసంగిస్తున్న సీనియర్ సివిల్ జడ్జి శ్యాంబాబు

ఒంగోలు టౌన్: అర్హులైన ప్రతి ఒక్కరికీ ఉచితంగా న్యాయ సహాయం అందించనున్నట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సహాయ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె. శ్యాంబాబు తెలిపారు. శనివారం జిల్లా జైలులో నిర్వహించిన జాతీయ న్యాయ సేవాధికార దినోత్సవంలో ప్రసంగించారు. ఖైదీలతో మాట్లాడి తక్షణం ఉచిత న్యాయ సహాయం ఏర్పాట్లు చేశారు. కారాగారంలో ఖైదీలకు అందుతున్న ఆహార పదార్థాల నాణ్యత పరిశీలించి ఇంకా మెరుగైన ఏర్పాట్ల కోసం పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడు లక్షల రూపాయల్లోపు ఆదాయం కలిగిన ప్రతి ఒక్కరికీ ఉచిత న్యాయ సహాయం అందించనున్నట్లు తెలిపారు. అలాగే ఆదాయంతో సంబంధం లేకుండా ప్రతి మహిళకు, షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ జాతుల వారికి, ప్రకృతి వైపరీత్యాలకు గురైన బాధితులకు, మానసిక వికలాంగులకు, విచారణలో ఉన్న ఖైదీలకు, చిన్నారులకు, యాచకులకు ఉచిత న్యాయ సహాయం కోసం న్యాయవాదిని నియమిస్తామని వివరించారు. జిల్లా జైలు అధికారులు వి. రమేష్, ఎం. శ్రీనివాసరావు, జిల్లా జైలు వైద్యాధికారి డాక్టర్ బ్రహ్మతేజ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు జి. రవి శంకర్, పి. వీరరాఘవులు పాల్గొన్నారు.

గోల్డెన్ గ్రానైట్ గనిలో భద్రతా తనిఖీలు

చీమకుర్తి రూరల్: ఆర్‌ఎల్ పురం పంచాయతీ పరిధిలోని గోల్డెన్ గ్రానైట్ గనిలో శనివారం భద్రతా తనిఖీలు నిర్వహించారు. 22వ గనుల భద్రత వారోత్సవాల్లో భాగంగా ఆఖరి రోజు కావడంతో వివిధ క్వారీల్లో శనివారం భద్రత తనిఖీల టీంలు విస్తృతంగా తనిఖీలు చేపట్టాయి. గోల్డెన్ గ్రానైట్ గనిలో టీం లీడర్ ఎస్ మురళీకృష్ణ రెడ్డి ఆధ్వర్యంలో టీం సభ్యులు విస్తృతంగా వివిధ విభాగాల్లో తనిఖీలు నిర్వహించారు. గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ. గిరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు. టీం సభ్యులను ఆయన స్వాగతం పలికారు. సందర్భంగా సేఫ్టీ వీక్ పతాకాన్ని ఆవిష్కరించారు. రికార్డులను పరిశీలించారు. ప్రథమ చికిత్స ఏర్పాటు కార్యక్రమాలను, సేఫ్టీ పరికరాలు పరిశీలించారు. గోల్డెన్ గ్రానైట్ జనరల్ మేనేజర్ ఏ. గిరిబాబు, ఫస్ట్ క్లాస్ మేనేజర్ యు. ఫణి కుమార్, సేఫ్టీ వీక్ కమిటీ జాయింట్ సెక్రెటరీ ఎ. రవి కుమార్, టీవీ లోకేష్, కుమారస్వామి, డి. శ్రీనివాసరావు, డాక్టర్ ఎస్కే నాయబ్ రసూల్, నారాయణరెడ్డి, సెల్వం పాల్గొన్నారు. అలాగే యాపిల్ గ్రానైట్ గనిలో జరిగిన భద్రతా తనిఖీల కార్యక్రమంలో యాపిల్ గ్రానైట్ ఏజెంట్ శిద్దా పవన్ కుమార్, టీం సభ్యులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కోటి సోమవారం


జమ్ములపాలెంలో ప్రత్యేక అలంకరణలో పంచముఖేశ్వరుడు

సాక్షి, ఒంగోలు: కోటి సోమవారం పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శివాలయాలు పోటెత్తాయి. శనివారం తెల్లవారుజాము నుంచే మహిళలు కార్తీక దీపాలు వెలిగించారు. స్వామి వారికి పంచామృత అభిషేకాలు, గోత్రనామార్చన, విశేష పూజలు నిర్వహించారు. భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించారు.


త్రిపురాంతకంలో అమ్మవారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు


సీఎస్‌పురం: పూజల్లో పాల్గొన్న భక్తులు


జమ్ములపాలెంలో 1116 శివలింగాల వేదిక


పొదిలి: క్యూలైన్‌లో భక్తులు


దర్శి: పూజలందుకుంటున్న కాశీ విశ్వనాథస్వామి


ఒంగోలులోని శివాలయంలో..


పొదిలి:జమ్మి చెట్టు కింద భక్తుల దీపారాధన

అడ్డగోలు తొలగింపులు అడ్డుకుంటాం

- అభివృద్ధికి వ్యతిరేకం కాదు
- జిల్లా ఏర్పాటులో జాప్యం ఎందుకు?
- మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు ధ్వజం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు, పక్కన షంషేర్, బాలమురళీకృష్ణ

మార్కాపురం: నియోజకవర్గంలో జరిగే అభివృద్ధికి వైఎస్సార్ సీపీ వ్యతిరేకం కాదని, కచ్చితంగా సహకరిస్తామని, మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నా రాంబాబు అన్నారు. అదే సమయంలో మార్కాపురం పట్టణం, పొదిలిలో ఆక్రమణల పేరుతో భవనాలను ఇష్టం వచ్చినట్లుగా, నిబంధనలకు వ్యతిరేకంగా, వైఎస్సార్ సీపీ సానుభూతిపరులే లక్ష్యంగా తొలగిస్తే అడ్డుకుంటామన్నారు. స్థానిక వైఎస్సార్ సీపీ కార్యాలయంలో ఏపీ మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ డాక్టర్ మీర్జా షంషేర్ అలీబేగ్, మున్సిపల్ చైర్మన్ బాలమురళీకృష్ణతో పాటు పలువురు నాయకులు, కౌన్సిలర్లతో కలిసి శనివారం సాయంత్రం విలేకరులతో మాట్లాడారు. అధికారులు కాలువలను హద్దుగా తీసుకొని తొలగించారా..? లేక ప్రభుత్వ భూమిని గుర్తించి అందులో ఉన్న ఆక్రమణలు తొలగించారా అన్న విషయంపై స్పష్టత ఇవ్వాలన్నారు. మున్సిపల్ కార్యాలయం, సబ్‌కలెక్టర్ ఇళ్ల వద్ద కూడా కాలువలున్నాయని, వాటిపై కూడా ఉన్న శ్లాబులను తొలగిస్తారా? అని ఎమ్మెల్యే కందుల నారాయణ రెడ్డి, మున్సిపల్ కమిషనర్‌ను నిలదీశారు. ఆక్రమణల పేరుతో భవనాల తొలగింపులో అధికారపార్టీకి ఒకలా... ప్రతిపక్ష పార్టీకి మరొకలా తొలగించడం మంచి పద్ధతి కాదన్నారు. ఓ విధానం లేకుండా కాలువలు దాటి లోపలికి వెళ్లి బిల్డింగులు పడగొట్టారన్నారు. దీంతో వందలాది మంది చిరు వ్యాపారులు, ప్రజలు జీవనోపాధిని కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. మార్కాపురంలో జరిగిన ఆక్రమణలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఎమ్మెల్యే ప్రయత్నించాలని, అధికారుల మాటలు నమ్మి అభివృద్ధి పేరుతో ఆక్రమణలు తొలగిస్తున్నామని చెప్పడం సరికాదని అన్నారు. ఆక్రమణల తొలగింపులో బంధుప్రీతి లేదని ఎమ్మెల్యే చెప్పాడని.. ఈ విషయంలో ఆయన వచ్చి చూస్తే తెలుస్తుందన్నారు. అన్ని పార్టీల నాయకులతో కలిసి ఆక్రమణల తొలగింపుపై పరిశీలిద్దామని చెప్పారు. కొన్ని చోట్ల సెల్లారుల్లోకి వెళ్లే శ్లాబ్‌లను, ర్యాంపులను కూడా తొలగించడం బాధాకరమన్నారు. 'లక్కీ షాపింగ్ మాల్ పూర్తయి ఎన్ని నెలలైంది... అక్కడికి వెళ్లి షాపింగ్ మాల్ అద్దాలు పగులగొట్టడం ఎంతవరకు సమంజసం? మరో షాపింగ్‌మాల్ కూడా అక్రమంగా కూల్చింది వాస్తవం కాదా' అని ప్రశ్నించారు. మీ ప్రణాళిక ఏమిటో కనీసం చట్టబద్ధంగా ఎన్నికైన మున్సిపల్ కౌన్సిల్‌కు కూడా చెప్పకపోవడం శోచనీయమన్నారు. చైర్మన్, వైస్ చైర్మన్‌లు, కౌన్సిలర్లను విస్మరించారని రాంబాబు విమర్శించారు. 21 రోజుల క్రితమే నోటీసులు ఇచ్చినట్లుగా ఎమ్మెల్యే కందుల చెప్పాడని, కౌన్సిల్‌కు చెప్పాల్సిన పనిలేదా అని ప్రశ్నించారు. ప్రభుత్వ స్థలాల్లో ఆక్రమణలు ఉంటే తొలగించవచ్చన్నారు. పక్షపాత ధోరణి, వివక్ష చూపితే అడ్డుకుంటామని హెచ్చరించారు.

మెడికల్ కాలేజీ పూర్తి చేయండి

మార్కాపురం మెడికల్ కాలేజీని ప్రభుత్వం ఆధ్వర్యంలోనే కట్టాలని, పీపీపీ విధానంలో పూర్తి చేస్తే వైద్య సీట్లు, వైద్యసేవలు పేదలకు అందవన్నారు. దీనిని వ్యతిరేకించి ముఖ్యమంత్రి చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వమే కాలేజీ నిర్మాణం చేపట్టేలా ఒత్తిడి తేవాలని అన్నా రాంబాబు అన్నారు. మార్కాపురం జిల్లా ఏర్పాటులో ఎందుకు జాప్యం జరుగుతుందో మీరే చెప్పాలని.. అధికారంలోకి రాగానే జిల్లా చేస్తామని చెప్పినా ఇప్పటికే నాలుగు నెలలు గడిచిపోయాయన్నారు. త్వరగా జిల్లా ఏర్పాటుచేసి అభివృద్ధి పనులు చేపట్టాలన్నారు.

వెలిగొండపై చర్చిద్దాం

పూలసుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్టు ప్రారంభించి పాతికేళ్లు కావస్తోందని.. దివంగత వైఎస్సార్ హయాంలో, ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వంలో 2014 నుంచి 2019 వరకూ ఉన్న టీడీపీ ప్రభుత్వంలో.. 2019 నుంచి 2024 వరకూ ఉన్న వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో జరిగిన అభివృద్ధిని చర్చిద్దామన్నారు. అబద్ధాలు చెబితే ప్రజలు నమ్మేస్థితిలో లేరని అన్నా అన్నారు. గుడ్డ కాల్చి మా నెత్తిన వేయవద్దని.. మాట్లాడేప్పుడు వాస్తవాలు తెలుసుకుని ప్రజలకు చెప్పాలన్నారు. తాను మార్కాపురానికి కొత్త కావచ్చని.. కానీ గత 16 ఏళ్లుగా రాజకీయాల్లో తన నిబద్ధత ఏమిటో ప్రజలకు తెలుసన్నారు. మార్కాపురంలో దేవాదాయశాఖలో భూములు ఆక్రమించినట్లుగా మాట్లాడుతున్నారని, ఆలిస్టు ఏమిటో బహిర్గతం చేయాలని కోరారు. పట్టణ నడిబొడ్డున విహారి లాడ్జి ఒక్క ఇంచు కూడా ప్రభుత్వ స్థలంలో లేదని రాంబాబు స్పష్టం చేశారు. తన లాడ్జి ముందు వాహనాలు పెడితే కేసులు రాస్తామంటూ పోలీసులు బెదిరించడం సమంజసం కాదన్నారు. లాడ్జి మెట్లను, ర్యాంపును తొలగించడం మంచి పద్ధతా అని ప్రశ్నించారు. విలేకరుల సమావేశంలో పార్టీ కౌన్సిలర్లు కొత్త కృష్ణ, శిరాజ్, ముంగమూరి శ్రీను, షెక్షావలి, సలీం, బండారు శ్రీను, మహమ్మద్, కొట్టే రామలక్ష్మమ్మ, హర్షిత, ఎంపీపీ లక్ష్మీదేవి కృష్ణారెడ్డి, పార్టీ ప్రధాన కార్యదర్శులు పత్తి రవిచంద్ర, బొగ్గరపు శేషయ్య, మహిళా ప్రతినిధులు నాలి రజని, పోరుమామిళ్ల విజయలక్ష్మీ, పార్టీ నాయకులు గుంటక చెన్నారెడ్డి, మండల జేసీఎస్ కన్వీనర్ శ్రీనివాసరెడ్డి, సత్యనారాయణరెడ్డి, ఉత్తమ్‌కుమార్, తర్లుపాడు వైఎస్సార్ సీపీ నేత రామసుబ్బారెడ్డి, గాయం శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చెవిరెడ్డి జన్మదిన వేడుకలు


చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి పుట్టిరోజు సందర్భంగా జిల్లా పార్టీ కార్యాలయంలో కేకు కట్ చేస్తున్న మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్, వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జి వరికూటి అశోక్‌బాబు, డాక్టర్ వెంకయ్య, తదితరులు

ఒంగోలు సిటీ: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి జన్మదిన వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ పాల్గొని కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆదిమూలపు సురేష్ మాట్లాడుతూ ఒంగోలు పార్లమెంట్ పరిశీలకులు చెవిరెడ్డి భాస్కరరెడ్డి నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుకున్నారు. కార్యక్రమంలో వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర నాయకుడు మాదాసి వెంకయ్య, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చుండూరి రవిబాబు, జిల్లా యూత్ జాయింట్ సెక్రటరీ ముల్లంగి రవీంద్రరెడ్డి, 14 డివిజన్ కార్పొరేటర్ ఇమ్రాన్, వివిధ డివిజన్ల అధ్యక్షుడు చిన్న, తిరుమలరెడ్డి, జేమ్స్, నాగం వెంకటరావు, వైఎస్సార్ సీపీ నాయకులు లంకపోతు అంజిరెడ్డి, పిగిలి శ్రీను, ఆనం శ్రీనివాసరెడ్డి, నటారు జనార్దన రెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, వడ్లమూడి వాణి, పేరం ప్రసన్న, కుందూరు రమణ, సాయిలక్ష్మి, మిరియం వెంకటేశ్వర్లు, దాసరి కరుణాకర్, ఎం.శివ, వెన్నపూస వెంకటేశ్వరరెడ్డి, షేక్ జిలాని, పి.వెంకయ్యనాయుడు, పాలడుగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.



'బొమ్మరిల్లు'లో వేడుకలు

ఒంగోలు పార్లమెంటరీ పరిశీలకుడు చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి జన్మదినం సందర్భంగా జిల్లా నాయకులు కేవీ రమణారెడ్డి, వై. వెంకటేశ్వరరావు, కేవీ ప్రసాద్, మల్లెల భాస్కర్ రెడ్డి, పిల్లి రాధాకృష్ణారెడ్డి బొమ్మరిల్లు బాలుర గృహంలో కేక్ కట్ చేసే భోజనం పెడుతున్న దృశ్యం

ప్రభుత్వం ఉందా..లేక ఎల్లో మీడియా పాలిస్తోందా..?

- మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్

ఒంగోలు సిటీ: అసలు రాష్ట్రంలో ప్రభుత్వం ఉందా లేక ఎల్లో మీడియా పాలన చేస్తుందా అని మాజీ మంత్రి ఆదిమూలపు సురేష్ అన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎండగట్టేలా సోషల్‌మీడియా ద్వారా ప్రశ్నిస్తున్న వారిని అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని విమర్శించారు. అరెస్ట్‌లు చేయడమే కాకుండా సోషల్‌మీడియా వారిని పోలీస్‌స్టేషన్ల చుట్టూ తిప్పుతూ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిని పూర్తిగా ఖండిస్తున్నామని చెప్పారు. పోలీసులు అనుసరిస్తున్న తీరు ఏకపక్షంగా ఉందని విమర్శించారు. ప్రభుత్వం చేస్తున్న తప్పిదాలను సరిదిద్దుకోవాలని హితవు పలికారు. హైకోర్టులో హెబియస్ కార్పస్ రిట్ వేశారని, సోషల్‌మీడియా వారిని పోలీసులు అక్రమంగా నిర్బంధించి హింసిస్తున్నారన్నారు. సీసీ ఫుటేజీలు కూడా సమర్పించాలని హైకోర్టు ఆదేశాలిచ్చిందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి మహిళలకు, బాలికల పై అత్యాచారాలు, లైంగిక దాడులు జరుగుతున్నా పట్టించుకోలేదన్నారు. వాస్తవాలను సోషల్ మీడియా ముందుకు తీసుకెళ్తంటే అక్రమ కేసులు బనాయిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. 'సాక్షి' ఛానల్ లేకుండా, ఎక్కడా ప్రతిపక్షంగా గొంతు వినిపించే ధోరణి లేకుండా చేయాలని చూస్తోందన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపై దాడులు, ఆస్తులు ధ్వంసం, అక్రమ కేసులు బనాయిస్తున్నారని చెప్పారు. కోర్టులు జోక్యం చేసుకునేంత వరకు వచ్చిందంటే రాష్ట్రంలో పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో చూడాలన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం భావవ్యక్తీకరణ స్వేచ్ఛను హరిస్తోందన్నారు. ఆయన వెంట వేమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ వరికూటి అశోక్‌బాబు, మాజీ పీడీసీసీ బ్యాంకు చైర్మన్ మాదాసి వెంకయ్య, ఒంగోలు నగర అధ్యక్షుడు కఠారి శంకర్, రాష్ట్ర కార్యదర్శి చుండూరి రవిబాబు ఉన్నారు.

మత్తు మందు ఇచ్చి బంగారు నగలు చోరీ

- చెన్నై నుంచి చీరాల వస్తుండగా పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో ఘటన
- సుమారు పది సవర్ల బంగారం మాయం


వైద్యశాలలో చికిత్స పొందుతున్న బాధిత మహిళ

చీరాల అర్బన్: రైలులో ప్రయాణిస్తున్న మహిళతో పక్కన కూర్చొన్న మరో మహిళ మాటామాటా కలిపింది. పరిచయం పెంచుకుని కొన్ని గంటల తర్వాత ముందస్తు ప్రణాళికలో భాగంగా మత్తు మందు కలిపిన జ్యూస్‌ను ఆమెకు ఇచ్చింది. స్పృహ కోల్పోయిన తర్వాత బ్యాగులో ఉన్న నగదు, ఒంటిపై ఉన్న బంగారు నగలతో ఉడాయించింది. స్పృహ కోల్పోయిన ఆమెను చీరాల రైల్వేస్టేషన్‌లో దించి చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు.

వివరాల్లోకి వెళ్తే..

చెన్నైలో స్థిరపడిన తాడి అనూరాధ పర్చూరులోని సోదరి ఇంటికి వెళ్లేందుకు శుక్రవారం పినాకిని ఎక్స్‌ప్రెస్‌లో చీరాలకు బయలుదేరింది. జనరల్ బోగిలో ప్రయాణిస్తున్న ఆమెకు ఓ మహిళ తోటి ప్రయాణికురాలిగా పరిచయం చేసుకుని పక్కన కూర్చొంది. మాటామాటా కలిపి పరిచయం పెంచుకుంది. రైలు నెల్లూరు వచ్చేసరికి అప్పటికే ఓ ప్రణాళిక ప్రకారం ముందుగా సిద్ధం చేసిన మత్తు మందు కలిపిన జ్యూస్‌ను ఆమెకు ఇచ్చింది. దీంతో ఆమె స్పృహ కోల్పోయింది. ఇదే అదనుగా ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలు, బ్యాగులోని నగదుతో ఉడాయించింది. రైలులో సదరు మహిళ స్పృహ కోల్పోవడంతో తోటి ప్రయాణికులు పోలీసులకు సమాచారం అందించారు. రాత్రి రైలు చీరాలకు చేరుకోవడంతో ముందుగా సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు 108 ద్వారా ఆమెను చీరాల ఏరియా వైద్యశాలకు తరలించారు. రాత్రి 11 గంటల సమయంలో ఆమెకు స్పృహలోకి రావడంతో అసలు విషయం తెలిసింది. తన పక్కన కూర్చొన్న మహిళ మత్తు మందు కలిపిన జ్యూస్ ఇచ్చిందని, తన బంగారు నగలు చోరీకి గురయ్యాయని తెలిపింది. జీఆర్పీ ఎస్సై కొండయ్య బాధిత మహిళలతో మాట్లాడి వివరాలను నమోదు చేసుకున్నారు.

మతం మారినవారిపై వివక్ష తగదు

- అలాంటి వారు ఎస్సీ హోదా కోల్పోవడం దారుణం



కార్యక్రమంలో మాట్లాడుతున్న విజయరాజు

ఒంగోలు వన్‌టౌన్: క్రైస్తవ మతంలోకి మారితే ఎస్సీ హోదా కోల్పోవడం దారుణమైన వివక్ష అని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు విజయరాజు గద్దపాటి అన్నారు. ఒంగోలు నగరంలోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో దళిత ఉద్యోగుల యునైటెడ్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా సాధించడంపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగం ప్రకారం.. వారి నమ్మకాల ప్రకారం వారికి ఇష్టం వచ్చిన మతం స్వీకరించవచ్చన్నారు. మత మార్పిడి చేసుకున్నందుకు మౌలిక హక్కులు కోల్పోవడం అనే అంశం అసమానతలకు దారి తీస్తుందన్నారు. 2007లో రంగనాథ్ మిశ్రా కమిషన్ దేశ ప్రభుత్వానికి చేసిన అనేక సూచనలలో దళితులకు ఎస్సీ హోదా కల్పించాలనే సూచన కూడా చేసిందన్నారు. తిరిగి మరో కమిషన్‌ను వేసిన ప్రభుత్వం సూచనలను మాత్రం పట్టించుకోవడంలేదన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల్లో ఒకటైన దళిత క్రైస్తవులకు ఎస్సీ హోదా ఇస్తామన్న హామీ నిలబెట్టుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మాజీ ఐఆర్‌ఎస్ అధికారి కె. సెల్వాన్ రాజ్, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంఘ నాయకులు విద్యుత్ శాఖ డీఈ సుధీర్, పాలపర్తి విజేష్ రాజ్, పి. అల్బర్ట్ మాథ్యూస్, పాస్టర్ జి. రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.